## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

# కాంగ్రెస్‌ను నమ్మితే భూములు ఖతమే

## పథకాలు పోతయ్.. జీవితాలు ఆగమైతమ్



### భూముల ధరలు పడిపోతయి..



నాకు గుల్లపేటలో ఎకరం భూమి ఉంది. వరి సాగు చేస్తున్న. ధరణి లేక ముందు పట్వారీ నాకు దొంగ పాసుపుస్తకాలు ఇచ్చి మోసం చేసిండు. తర్వాత ఎంఆర్‌వో కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగీ దాన్ని రద్దు చేయించుకొని ఆన్‌లైన్ చేయించుకున్న. సీఎం కేసీఆర్ ధరణి తెచ్చి మాకు భరోసా కల్పించిండు. ఇప్పుడు మా వేలిముద్ర లేనిదే భూ మి మరొకరి పేరుమీద మార్చే అవకాశమే ఉండదు. కానీ ఈ దిక్కుమాలిన కాంగ్రెస్ రైతుల మీద ఎందుకో పగబట్టింది. వాళ్లు మా ట్లాడుతున్నదాన్ని బట్టి చూస్తే నిరంతర కరెం టు పోయి, 10హెచ్‌పీ మీటర్లు వచ్చేటట్టే ఉంది. ఇంకా ధరణి ఎత్తేస్తా అంటున్నరు. అట్లయితే చానా కష్టమైతది. మళ్లీ సమస్యలు పెరుగుతయి. పట్వారీల అజమాయిషీ వస్తే భూముల మీద ఇపుడున్న ధీమా పోతుంది. భూముల ధరలు పడిపోతయి.

**- మెడపట్ల లక్ష్మారెడ్డి, రైతు, గుల్లపేట(జగిత్యాలటౌన్)**

జగిత్యాల, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతుల పట్ల అనుచితంగా ప్రవర్తించింది. కరెంట్, నీళ్లు లేక రైతులు తీవ్రమైన నష్టాల్లో కూరుకుపోయారు. అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారు. కరెంట్ కోసం ఆందోళనకు దిగిన రైతులపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుచితంగా ప్రవర్తించి గుర్రాలతో తొక్కించి చంపిన సందర్భాలను సైతం అన్నదాతలు గుర్తు చేసుకుంటున్నారు. రాత్రి మూడు గంటలు, పొద్దంతా నాలుగు గంటల కరెంట్ ఇచ్చి రైతుల ఉసురు పోసుకుని పదేళ్లు అధికారానికి దూరంగా ఉన్నా కాంగ్రెస్ పార్టీ వైఖరిలో మార్పు కనిపించడం లేదు. ఇప్పటికీ అదే తీరుతో రైతులపై విరుచుకుపడుతోంది. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తూ సీఎం కేసీఆర్ దుబారాకు పాల్పడుతున్నారని, కేవలం మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద దుమారాన్నే లేపాయి. ఈ విషయాన్ని రైతులు మర్చిపోకముందే తను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ 10 హెచ్‌పీ మోటర్లు పెడితే మూడెకరాలు మూడు గంటల్లో పారుతుందని చెప్పడంతో రైతులకు పుండు మీద కారం చల్లినట్లయ్యింది. అంతే కాకుండా, రైతుల భూములకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కొత్త రెవెన్యూ చట్టాన్ని తెచ్చి పట్వారీ వ్యవస్థను తొలగించారు. అధికారుల చేతిలో ఉన్న భూములనే రైతుల చేతిలో పెడుతూ ధరణి పేరుతో ఒక పటిష్టమైన వ్యవస్థను తెచ్చారు. దీనిపైనా కాంగ్రెస్ నాయకులు విచక్షణారహితంగా మాట్లాడుతున్నారు. ఆ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామని చెప్పడం రైతుల్లో కలకలం సృష్టిస్తున్నది.

### పదేళ్లలో అనూహ్య మార్పు

ఎండుగులా మారిన వ్యవసాయాన్ని పండుగలా తీర్చిదిద్దిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఈ రంగంలో అనేక సంస్కరణలు తెచ్చింది. అన్ని విషయాలను పక్కన పెట్టి వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత రంగంగా గుర్తించి చేయూతనిచ్చింది. 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం వంటి విప్లవాత్మక ప్రాజెక్టు నిర్మాణంతో సాగు నీటి వ్యవస్థను పటిష్ట పర్చింది. ఒకప్పుడు రైతుల ఆత్మహత్యకు పురికొల్పిన అంశాలను పరిశీలించి ఆ వ్యవస్థల నాడిపై దెబ్బకొడుతూ రైతుబంధు పేరుతో వ్యవసాయానికి పెట్టుబడి సహాయాన్ని అందించింది. రైతులు అప్పుల పాలు కాకుండా రక్షణ కల్పించింది. భూగర్భ జలాలను వృద్ధి చేసే లక్ష్యంతో మిషన్ కాకతీయ కింద చెరువులు, కుంటలను పునరుద్ధరించింది. పుష్కలమైన నీళ్లు, నాణ్యమైన కరెంట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఒకప్పుడు ఎకరం, రెండెకరాలు సాగు చేసిన రైతులు ఇప్పుడు ఉన్న భూమి మొత్తాన్ని సాగులోకి తెచ్చుకుని బంగారు పంటలు పండిస్తున్నారు. ఈ సంస్కరణలతో వ్యవసాయం గాడిలో పడడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా మారింది. ఒకప్పుడు అప్పుల కోసం చేయిచాపిన రైతులు ఇప్పుడు ఇతరులకు అప్పులు ఇచ్చి ఆదుకునే స్థితికి వచ్చారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల పట్ల కనబరుస్తున్న ప్రాధాన్యతను జీర్ణించుకోలేక పోతున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వీటిని రైతులకు దూరం చేయాలనే కుట్ర కోణంలో ఆలోచన చేస్తున్నట్లు కనిపిస్తోంది.

### చేజారితే జరిగేది ఇదే..

పదేళ్లలో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పుల కారణంగా రైతులు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారు. రైతులు బీఆర్‌ఎస్‌కు వెన్నుదన్నుగా ఉన్నారని విషయాన్ని గ్రహించిన ఆ పార్టీ రైతులపై విచక్షణా రహితంగా విషాన్ని చిమ్ముతోంది. ఒకవేళ తప్పిదారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇప్పుడు రైతులు ప్రయోజనం పొందుతున్న వ్యవస్థలన్నీ కుప్పకూలే ప్రమాదం పొంచి ఉన్నది. ఒకప్పుడు నీళ్లు, కరెంట్ లేక రైతుల భూములకు ధరలు ఉండేవి కావు. ఇప్పుడు ఈ సదుపాయాలు కల్పించిన తర్వాత గత మూడు నాలుగేళ్లలో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రధాన రహదారుల వెంట ఉన్న భూములకు ఎకరాకు రూ.కోటి నుంచి రూ.3 కోట్లకు పైగా పలుకుతోంది. ఏ మారుమూల ప్రాంతమైనా ఎకరాకు రూ.50 లక్షలకు తక్కువ ధరలు లేవు. ఇప్పుడు తప్పిదారిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మళ్లీ మునుపటి పరిస్థితులు పునరావృతం కాక తప్పదనే చర్చ జరుగుతోంది. అంతే కాకుండా, ధరణి వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఇప్పటి వరకు రైతుల చేతిలో ఉన్న భూములు తిరిగి అధికారుల చేతికి వెళ్లిపోతాయి. రైతుబంధుకు ధరణి వ్యవస్థ ఇప్పటి వరకు సమాచార కేంద్రంగా ఉంది. దీనిని తొలగిస్తే ప్రతి ఆరు నెలలకు ఒకసారి పహాణీకో, లేదా మరేదైనా సర్టిఫికెట్ కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అంతే కాకుండా, ఈ వ్యవస్థను రద్దు చేసి గతంలో ఉన్న రకరకాల కాలమ్స్‌ను జోడిస్తే ఇప్పటి వరకు రైతులకు ఉన్న హక్కులు వికేంద్రీకరించబడి సంబంధం లేని వ్యక్తులకు హక్కులు సంక్రమించే ప్రమాదం పొంచి ఉంది. అటు నీళ్లు, కరెంట్, ఇటు ధరణి తొలగింపు వల్ల కలిగే అనర్థాలు వెరచి భూముల ధరలు పదేళ్ల ముందు ఉన్న వాటి కంటే మరీ అధ్వానంగా పడిపోక తప్పని పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా పదేండ్లు కష్టపడి నిర్మించుకున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలక తప్పదని, మునుపటిలాగే గ్రామీణ ప్రాంత యువత వలసలు వెళ్లే పరిస్థితులు వస్తాయనే భయపడుతున్నారు.

- **ధరణి లేకుంటే మళ్లీ పాత రోజులే వస్తయ్.. ధరలు పడిపోతయ్**
- **సాగు విస్తీర్ణం తగ్గుతది.. రైతు బతుకు ఆగమైతది**
- **లంచావతారులు పుట్టుకొస్తరు**
- **పైరవీకారులు రాజ్యమేలుతరు**
- **గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నాశనమైతది**
- **మళ్లీ వలసలు మొదలవుతయ్**
- **ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతాంగం**
- **హస్తం పార్టీకి బుద్ధి చెబుతామని హెచ్చరిక**
- **రైతుబిడ్డ కేసీఆర్‌కు అండగా ఉంటామని స్పష్టీకరణ**

### భూములు తారుమారైతయి..

ధరణి పోర్టల్‌ను తీసివేస్తే రైతులు మళ్లీ దోపిడీకి గురవుతారు. కాంగ్రెస్ నేతలకు రైతులు సల్లగుండడం ఇష్టం లేదు. వారిని దోచుకోవడానికి ఆ పార్టీ నేతలకు మార్గాలు కావాలి. అందుకే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నరు. కొత్త పోర్టల్ వస్తే రైతు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే. పటేల్, పట్వారీ వ్యవస్థతో భూములు తారుమారయ్యే ప్రమాదం ఉంది. లంచాలు ఇవ్వకపోతే అధికారులు పని చేయరు. గతంలో ఒకరి పేరు మీద ఉన్న భూమిని మరొకరి పేరుపై రాసేటోళ్లు. అలాంటి మోసాలు జరగొద్దనే సీఎం కేసీఆర్ ధరణి తెచ్చి రైతు భూమికి భద్రత కల్పించిండు. రైతు బీమా కల్పిస్తుండు. వడ్లు కొనుగోలు చేసి డబ్బులు నేరుగా మా అకౌంట్లో వేస్తుండు. కాంగ్రెస్ కపట నాటకాలను ఎన్నికల్లో తిప్పికొడతాం.

**- ఈరాదు భూమేష్, రైతు, ఓబులాపూర్(మల్లాపూర్)**

### సాగు విస్తీర్ణం పడిపోతది..



ధరణి పోర్టల్‌తో రైతులకు భూరికార్డుల సమస్యలు తీరినయ్. ఆన్‌లైన్‌లో భూములు భద్రంగా ఉన్నయ్. భూమి అమ్మకాలు, కొనుగోళ్లు ఈజీగా అయిపోతున్నాయి. దళారులు లేరు, మధ్యవర్తులు లేరు. రైతులు వేలిముద్ర పెడితే తప్ప భూరికార్డులు మార్చే అవకాశం ఎవరికీ లేదు. కాంగ్రెస్ వస్తే ధరణి తీసేస్తామని అంటున్నరు. అది తీసేస్తే రైతులకు మళ్లా మునుపటి ఇబ్బందులే వస్తయి. పాత రెవెన్యూ విధానంతో రికార్డులు తారుమారయ్యే ప్రమాదం ఉంటది. మళ్లీ ఆఫీసుల చుట్టూ తిరుగుడు అయితది. కోర్టు కేసులైతయి. మళ్లీ భూములు పడావు పెట్టుడే అయితది. ఇంకా కౌలు దారు కాలమ్‌తో ఉద్యోగాలు చేసే భూ యజమానులు తమ భూములను కౌలుకు ఇచ్చేందుకు జంకుతరు. అవి కూడా పడావుగానే ఉంటయి. ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గిపోతుంది. రైతులను గోసపెట్టాలని కాంగ్రెస్ చూస్తుంది. ఎట్టి పరిస్థితుల్లో ఆ పార్టీని రానివ్వం. సీఎం కేసీఆర్‌కే మద్దతు పలుకుతాం.

**- దమ్మ సురేందర్‌రెడ్డి, రైతు, గుల్లపేట(జగిత్యాలటౌన్)**

### కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు..



ధరణి పోర్టల్ మంచిగానే ఉంది కదా. పట్టాదారు లేకుండా ఒకరి భూమిని మరొకరికి పట్టా చేసే అవకాశం లేదు. ఎవరి భూమి వాళ్ల చేతుల్లోనే ఉంటుంది. మనం ఎక్కడ ఉన్నా స్మార్ట్‌ఫోన్ ఉంటే ఆన్‌లైన్‌లో భూమి వివరాలు తెలుసుకోవచ్చు. ఇంత మంచిగున్న ధరణిని కాంగ్రెసోళ్లు తీసేస్తా అంటున్నరు. ఇంకా ఎవుసానికి 24 గంటలు ఎందుకు.. మూడు గంటలు చాలని మాట్లాడుతున్నరు. 10హెచ్‌పీ మోటర్ పెట్టుకుంటే పని ఈజీగా అవుతుందని ఏదేదో అంటున్నరు. అదే జరిగితే రైతు బతుకే ఆగమైపోతుంది. కౌలుదారు కాలమ్ భయంతో స్వయంగా వ్యవసాయం చేయలేని వారు భూమిని బీడు పెడతారు తప్ప కౌలుకు ఇచ్చి రిస్క్ తీసుకోరు. ఫలితంగా సాగు విస్తీర్ణం పడిపోతుంది. ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుంది. గ్రామాల్లో 70శాతం వ్యవసాయం మీద ఆధారపడ్డ కుటుంబాలవారు ఆదాయాలు కోల్పోతారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. ఇవన్నీ జరిగితే భూముల ధరలు పతనమవుతాయి. గతంలో భూములకు పెద్ద ధరలు లేక కొద్దిపాటి అప్పులకే భయపడి ఆత్మహత్యలకు పాల్పడ్డ రైతులు, స్వరాష్ట్రంలో ధరలు పెరిగాక అప్పుమీద భయం పోయింది. దాంతో రైతు ఆత్మహత్యలు నిలిచిపోయాయి. ఇపుడు ధరలు పతనమైతే తిరిగి ఆత్మహత్యలు మొదలవుతాయి. ఇవన్నీ బాధలు అవసరమా..? అయినా కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. ఆ పార్టీకి అధికారం ఇచ్చేదెవరు..? పాలించేది ఎక్కడ.

**- చింతలపెల్లి కిషన్ రెడ్డి, చల్‌గల్, జగిత్యాల మండలం**

### రైతు బతుకే ఆగమైపోతది..



తెలంగాణ సర్కారు తెచ్చిన ధరణితో ఆఫీసుల చుట్టూ తిరుగుడు పూర్తిగా బంద్ అయ్యింది. దళారీ వ్యవస్థ కనుమరుగైంది. ఇపడు భూమిని అమ్ముకోవాలన్నా, కొనాలన్నా స్లాట్ బుక్ చేసుకొని మండలాఫీసుకు పోతే గంటలోనే పనైపోతంది. మ్యుటేషన్ అయిపోయి సాఫ్ట్ కాపీ కూడా వస్తంది. ఇంత మంచిగున్న ధరణిని తీస్తే భూములకు భద్రత కరువైతది. మళ్లీ పట్వారీ వ్యవస్థ వస్తది. కాట్లాటలు అయితయి. కౌలుదారు కాలమ్‌తో యజమానులు తమ భూములను కౌలుకు ఇచ్చేందుకు వెనుకాముందైతరు. భూములు పడావు పెట్టాల్సి వస్తది. ఫలితంగా రైతు బతుకే ఆగమైపోతది.

**- బొల్లారపు పెద్ద బీమయ్య, రైతు, చల్‌గల్, జగిత్యాల మండలం.**

### భూములకు భద్రత ఉండదు..

ధరణి వచ్చినప్పటి నుంచే మా భూములు సేఫ్‌గా ఉన్నాయి. నాడు కాగితాల్లో భూ యజమానికి తెలియకుండానే ఇంకొకరికి రాసేటోళ్లు. ధరణిని తీసేసి మళ్లీ పాత విధానం తెస్తే భూములకు భద్రత ఉండది. పట్వారీ వ్యవస్థతో ఇబ్బందులు వస్తయి. నాడు భూముల రిజిస్ట్రేషన్లతో ఎన్నో ఇబ్బందులు ఉండే ఇప్పుడా పరిస్థితి లేదు. మండల కేంద్రాల్లోనే రిజిస్ట్రేషన్లు అయితున్నయి. దూరభారం తగ్గింది. కౌలు చట్టం తెస్తే కొట్లాటలు అయితయి. చిన్న, మధ్యతరగతి రైతులు, ఉద్యోగులు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు వారికున్న కొద్దిపాటి భూములు బీళ్లుగా ఉంచకుండా కౌలుకు ఇస్తున్నరు. ఇప్పుడు ఇచ్చే పరిస్థితి ఉండదు. కేంద్ర ప్రభుత్వం రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. మోటర్లకు మీటర్లు పెట్టాలని చెప్పినా సీఎం కేసీఆర్ ఒప్పుకోలేదు. అంత గొప్ప నాయకుడు కేసీఆర్. ఎవుసానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. ఏ బాధాలేకుంట చూసుకుంటున్నడు. మాకు సారే కావాలి.

**- కోల శ్రీనివాస్, ఆర్బీఎస్ మండల కన్వీనర్, సారంగాపూర్**




### రైతుల ఆత్మహత్యలు పెరుగుతాయి



ఎవుసానికి మూడు గంటల కరంటే ఇస్తామని కాంగ్రెస్ అంటున్నది. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని మాట్లాడుతంది. మరోవైపు కేంద్రంలోని బీజేపీ మోటర్లకు మీటర్లు పెట్టాలని చూస్తంది. ఇట్లా అయితే మళ్లీ ఎవుసం ఆగమైతది. రైతులకు ఆత్మహత్యలే దిక్కవుతాయి. దీనికి తోడు ధరణిని రద్దు చేసి, కౌల్దార్ చట్టం తెస్తామని కాంగ్రెస్ అంటోంది. దీంతో రైతులకు తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతయి. భూములకు భద్రత ఉండదు. ఒకరి భూమి మరొకరి పేరుమీద మారుతది. మోటర్లకు మీటర్లు పెడితేనే రాష్ట్రానికి నిధులు మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉంది. మీటర్లు పెట్టడం వల్ల ఉచిత విద్యుత్ లేకుండా పోతుంది. విద్యుత్ బిల్లుల భారం రైతులు మోయలేరు. తెలంగాణలో విద్యుత్, నీళ్ల ఇబ్బందులు లేకుండా చేసిన సీఎం కేసీఆర్‌ను, రైతులను ఇబ్బందులు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మోటర్లకు మీటర్లు పెట్టాలని నిబంధనలు పెట్టడం అన్యాయం. వ్యవసాయ విద్యుత్‌పై నిబంధనలు పెట్టే కాంగ్రెస్, బీజేపీలను తరిమికొడతాం.

**- ఒరుగల రాజేశం, రైతు సంఘం నాయకుడు(పెగడపల్లి)**

### 3 గంటల కరెంట్ అంటే.. ఎవుసం బందే



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయానికి 24 గంటలకు బదులు కేవలం మూడు గంటలే ఇస్తామని అంటోంది. అట్లయితే వ్యవసాయం బంద్ చేసుడే అయితది. ఆ కరెంట్‌తో ఒక్క మడైనా పారుతదా.. ఏ పంట పండుతది. అన్నీ ఎండిపోతయి. గ్రామాల్లో 70 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నరు. పదేండ్ల కిందటి దాకా కరెంట్ కష్టాలతో ఆగమయ్యారు. ఎవుసాన్నే విడిచిపెట్టారు. తెలంగాణ వచ్చిన తర్వాతనే మళ్లీ నాగలిపట్టిన్రు. బతుకులు మారినయి. 24 గంటలు ఉచిత కరెంట్, రైతుబంద్, సకాలంలో ఎరువులు, విత్తనాలు, భూగర్భ జలాలు పెరగడంతో గుంట భూమికూడా వదలకుండా పంటలు పండిస్తున్నరు. సాగు విస్తీర్ణం పెరిగింది. భూముల ధరలు బాగా పెరిగాయి. కాంగ్రెస్ వస్తే మళ్లీ పాత కథే అయితది. సాగు విస్తీర్ణం తగ్గుతుంది. దీని వల్ల వ్యవసాయ భూముల ధరలు కూడా పడిపోయే అవకాశం ఉంది. పనులు లేకుండా పోయి ఇతర ప్రాంతాలకు వలసపోవాల్సి వస్తది. ఇట్లా జరగవద్దు అంటే బీఆర్‌ఎస్ సర్కారే మళ్లీ రావాలి. కేసీఆర్‌తోనే రైతులకు మేలు జరుగుతుంది.

**- కోల రాజు, రామాజిపేట (రాయికల్ మండలం)**

### భూముల ధరలు పడిపోతయి..



కాంగ్రెస్ కౌల్దార్ చట్టం అమలు జేసి, పాత పట్వారీ వ్యవస్థను తెస్తామని చెప్పడం అన్యాయం. దీని వల్ల రైతులకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. భూముల ధరలు పడిపోతయి. భూములు ఉన్న రైతులు ఇంకొకలకు భూములను కౌలుకు ఇవ్వరు. బీడుపడిపోతయి. సాగు విస్తీర్ణం పడిపోతది. ఇలా చిల్లర ఆలోచనలు చేస్తున్న కాంగ్రెస్‌ను అందరూ ఎదుర్కోవాలి. సీఎం కేసీఆర్ అమలు చేసిన ధరణి వల్ల ఎలాంటి భూ సమస్యలు లేవు, దీన్ని రద్దు చేస్తే మళ్లీ కథ మొదటికే వస్తది. అనేక సమస్యలు వస్తయి. వాళ్లు వద్దు. వాళ్ల పాలన వద్దు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెబుతం.

**- శంభర్తి రాయముల్లు, రైతు(పెగడపల్లి)**

### భూములు అంగడంగడి అయితయి



ధరణితోనే మా భూములకు భద్రత ఏర్పడింది. టెన్షన్ లేకుండా ఉంది. నాడు కాంగ్రెస్ పాలనలో భూ రికార్డులన్నీ గందరగోళంగా ఉండె. అమ్మేందుకు, కొనేందుకు చానా ఇబ్బందులు పడ్డరు. ఆ బాధలన్నీ ఇంకా ఎవరూ మరిచిపోలే. ఈ ఏడాది మన పేరు మీద ఉన్న భూమి వచ్చే ఏడాదికల్లా ఇంకొకరి పేరుమీద ఎక్కుతుండె. పట్వారీలదే రాజ్యం ఉండె. లంచాలు ఎవరికి ఇస్తే వాళ్లకు రాసేటోళ్లు. కానీ ధరణి వచ్చిన తర్వాత వివరాలు ట్రాన్స్‌ఫరెంట్‌గా జరుగుతున్నాయి. అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని తగ్గింది. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే భూ మార్పిడి జరిగిపోతుంది. ధరణి ఉండడం వల్లే దర్జాగా రైతుబంధు వస్తుంది. కాంగ్రెస్ ధరణిని తీసేస్తే భూములు అంగడంగడి అయితయి. భద్రత ఉండదు. కౌలు చట్టం వస్తే అసలు భూపట్టాదారునికి ఇబ్బందులు తప్పవు. అలా జరిగితే వ్యవసాయం చేయలేని రైతులు తమ భూములను కౌలుకు ఇయ్యకుండా బీడుగానే ఉంచుతారు.

**- బొంతల ఆదిరెడ్డి, కిష్టంపేట, రాయికల్ మండలం.**

### భూములు మింగేతందుకా..?



తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్ సర్కారు మా రైతుల సంక్షేమానికి అనేక పథకాలు తెచ్చింది. 24గంటల కరెంట్, రైతుబంధు ఇస్తంది. నాకు గొల్లపల్లిలో నాలుగెకరాల భూమి ఉంది. గతంలో రికార్డులు సరిగ్గా లేక గ్రామాలల్ల భూ సమస్యలు ఎక్కువగా ఉంటుండె. ఎక్కడ చూసినా కొట్లాటలే. ధరణి పోర్టల్‌తో భూ సమస్యలన్నీ తీరినయి. ఇంత మంచిగ ఉన్న ధరణిని కాంగ్రెస్ నాయకులు బంగాళాఖాతంలో వేస్తమని మాట్లాడుతున్నరు. మళ్లీ పాత వ్యవస్థ తీసుకొస్తామని అంటున్నరు. ఎందుకు..? భూములు మింగేతందుకా..? మా భూములు మాకు కాకుండా చేస్తరా..? అవన్నీ కుదరవు. అంటే మళ్లీ వీఆర్వోలు, ఆర్ఐలను తీసుకొస్తరు. దళారులు పుట్టుకొస్తరు. వాళ్లదే రాజ్యం అయితది. ఇంకా కౌలు రైతుల కోసం చట్టం తీసుకొస్తామని చెప్పడం పట్టాదారుల రైతుల్లో భయాన్ని కలిగిస్తున్నది. ఈ చట్టం పట్టాదారుడికి మధ్య, కౌలు రైతుల మధ్య దూరాన్ని పెంచుతుంది. పట్టాదారులు అవసరమైతే వ్యవసాయం బంద్ పెడుతరు కానీ, భూమిని కౌలుకు ఎవరూ ఇయ్యరు. ఈ బాధలు అవసరమా..? మంచిగ ఉన్నదాన్ని అలాగే ఉండనియ్యండి. ధరణి పోతే రైతుల బతుకులు ఆగమైతయి. మళ్లీ మ్యుటేషన్ల కోసం రెవెన్యూ అధికారుల చుట్టు తిరగాల్సి వస్తుంది. డబ్బులు ఇస్తే గానీ పనులు కావు. రైతును కష్టాల పాలు చేయాలనుకున్న కాంగ్రెస్‌కు ఆదిలోనే అడ్డుకట్ట వేద్దాం. ఎన్నికల్లో బుద్ధి చెబుదాం.

**- పిట్టల శేఖర్, రైతు, గొల్లపల్లి**

### మా తెరువు రావద్దు.. ఇప్పుడే మంచిగుంది..



మాది కథలాపూర్ మండలం బొమ్మెన. మాకు ఊళ్లే పదెకరాల వ్యవసాయ భూమి ఉంది. కాంగ్రెసోళ్లవి అన్ని దళారీ మాటలె. వాళ్లు ఎప్పుడైనా దళారులను బతికించాలనే చేస్తరు. రైతుల గోస వాళ్లు ఏనాడూ పట్టించుకున్నరు. ఇప్పుడు మళ్ల ఎన్నికలొస్తే రైతులను ఆగం చేసే మాటలు మాట్లాడుతున్నరు. కౌలు దారు చట్టం తెస్తే పట్టాదారులు, యజమానులు భయపడే ప్రమాదముంది. రైతులకు వీలు కానీ సమయాల్లో తన భూమిని ఇతరులకు కౌలుకు ఇస్తే రికార్డుల్లో నమోదు చేయడం వల్ల కొద్ది రోజులకు కౌలుదారులు కోర్టులను ఆశ్రయిస్తే పట్టా దారులకు ప్రమాదకరంగా మారుతుంది. మా భూములపై ఇతరుల పేర్లు రికార్డులో ఎక్కిస్తే ఇబ్బందే కదా. దాని కంటే భూములు ఖాళీగా ఉంచుకోవడం నయం. ఎవరికీ ఏ బాధ లేకుంట అందరూ సంతోషంగ ఎవుసం చేసుకుంటే కాంగ్రెస్‌కు ఏం బాధ అయితంది. ధరణిని రద్దు చేస్తే ఊరుకోం. మా తెరువు రావద్దు. ఇప్పుడే మంచిగుంది.

**- పిడుగు లావణ్యరెడ్డి, మహిళ రైతు, బొమ్మెన (కథలాపూర్)**